## సత్కారాలు కవుల బాధ్యతలను పెంచుతాయి

డాక్టర్ కావడి ఎల్లయ్య




అభిలాష హెల్పింగ్ హ్యాండ్ స్వచ్ఛంద సంస్థ అందజేసిన అవార్డుతో డాక్టర్ కావడి ఎల్లయ్య

సైదాబాద్, ఫిబ్రవరి 6: వైద్యం, సాహితీ రంగాల్లో తాను చేసిన సేవలకు గుర్తింపు రావటంతో బాధ్యత మరింత పెరిగిందని డాక్టర్ కావడి ఎల్లయ్య అన్నారు. సమాజంలో పేదరికంతో బాధపడుతున్న నిరుపేదలకు ఉచిత వైద్య సేవలను అందించటమే కాకుండా తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో ఆయన రచనలు సాహితీ సేవలను గుర్తించి అభిలాష హెల్పింగ్ హ్యాండ్ స్వచ్ఛంద సంస్థ అవార్డు అందజేసి సన్మానించింది. ఈ సందర్భంగా డాక్టర్ కావడి ఎల్లయ్య మాట్లాడుతూ, కొన్నేండ్లుగా పేదలకు ఉచితంగా వైద్య సేవలను అందిస్తున్నానని, అదే విధంగా తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో పలు రచనలు చేస్తూ సాహితీ రంగంలో నా వంతు పాత్ర పోషిస్తున్నానని తెలిపారు. తన రచనలు, కథలు, కవితలు, నాటికలు ఎంతో ప్రాచుర్యం పొందాయని, వాటిని గుర్తించి రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందజేసి, ఘనంగా సత్కరించటం మరిచిపోలేని అనుభూతిని కలిగించిందన్నారు. న్యూ సైదాబాద్ కాలనీవాసులు, సాహితీ అభిమానులు ఆయన్ని కలిసి అభినందనలు తెలిపారు.

# వ్యాపారాలకు అనువుగా స్థలాన్ని కేటాయించండి

ఎమ్మెల్యేకు లారీ సప్లయర్స్ అసోసియేషన్ సభ్యుల వినతి



ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి తమ సమస్యలపై వినతిపత్రం సమర్పించి సన్మానిస్తున్న దృశ్యం

మన్సూరాబాద్, ఫిబ్రవరి 6: ఆటోనగర్‌కు చెందిన లారీ సప్లయర్స్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని కలుసుకుని తాము వ్యాపారం చేసుకునేందుకు అనువుగా ఉండే ప్రాంతాన్ని గుర్తించి స్థలాలను కేటాయించాలని వినతి పత్రం సమర్పించారు. మొదట గోషామహల్‌లో ట్రాన్స్‌పోర్ట్స్ పెట్టి వ్యాపారాలు చేసుకునేవారమని, అక్కడి పెరిగిన ట్రాఫిక్ సమస్యల దృష్ట్యా సిటీ శివారుల్లోని ఆటోనగర్‌లో వ్యాపారాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. ఆటోనగర్‌లోను ప్రస్తుతం పెరిగిన రద్దీ దృష్ట్యా ఇక్కడి నుంచి ఖాళీ చేయిస్తున్నారని తెలిపారు. రామోజీ ఫిలిం సిటీ సమీపంలో ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలు పెట్టుకోవడం వలన ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని లారీ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేకు వివరించారు. ఇందుకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శ్రీనివాస్‌బాబు, శ్రీనివాసరావు, శంకర్, శేషు, యాసిన్, జగదీశ్ గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న సతీష్, రాజు, శివ మాలధారణ స్వాములు

వనస్థలిపురం, ఫిబ్రవరి 6: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత సిద్ధిస్తుందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శివశక్తి అన్నదాన సేవా సమితి, శ్రీ మల్లికార్జున భక్త సమాజం ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యేను కలిసి, ప్రసన్నాంజనేయ దేవస్థానంలో జరిగే నిత్యాన్నదాన కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నిత్యం అన్నదానం చేయడం అభినందనీయమని, దైవ సేవతో పాటు, సామాజిక బాధ్యత ఉండటం హర్షణీయమని పేర్కొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మల్లికార్జున భక్త సమాజం రాష్ట్ర అధ్యక్షుడు ముద్దగోని సతీష్ కుమార్ గౌడ్, శివశక్తి అన్నదాన సమితి అధ్యక్షుడు కాటం రాజు గౌడ్, శివ మాలధారణ స్వాములు పాల్గొన్నారు.

## ఎస్బీఐ, కృష్ణానగర్‌లో పైప్‌లైన్లు ఏర్పాటు చేయండి

సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్



అధికారులతో ఎస్బీఐ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్

ఆర్కేపురం, ఫిబ్రవరి 6: ఎస్బీఐ, కృష్ణానగర్ కాలనీల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ అధికారులకు సూచించారు. సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఎస్‌బీఐ కాలనీ, కృష్ణానగర్ కాలనీల్లో హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఎస్‌బీ జీఎం, డీజీఎం, మేనేజర్, సూపర్‌వైజర్‌తో కలిసి కార్పొరేటర్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీల్లో నెలకొన్న సమస్యలను అధికారులకు వివరించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ గతంలో ఏర్పాటు చేసిన పైప్‌లైన్లు పెరిగిన జనాభాకు సరిపోకపోవడంతో తరచు డ్రైనేజీ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని చెప్పారు. పెరిగిన జనాభాకు అనుకూలంగా నూతన పైప్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

## హయత్‌నగర్ అభివృద్ధే ప్రధాన లక్ష్యం

కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి



పైప్‌లైన్ పనుల పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవ జీవన్ రెడ్డి

హయత్‌నగర్, ఫిబ్రవరి 6: డివిజన్‌లోని ప్రతి కాలనీలో పూర్తి స్థాయి అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి అన్నారు. హయత్‌నగర్‌లోని వర్దయ్య కాలనీలో జరుగుతున్న వరదనీటి పైపులైన్ పనులను వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి కార్పొరేటర్ నవ జీవన్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న కాలంలో కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వరదనీటి పైపులైన్‌ను నిర్మించాలన్నారు. వీలైనంత త్వరగా పనులు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఏఈ చంద్రశేఖర్, జల మండలి మేనేజర్ రాజు, నాయకులు బండారి భాస్కర్, గంగని శ్రీను, కాలనీ అధ్యక్షుడు వరదరాజు పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్స్ సమాజానికి దిక్సూచి

మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి



ఆదర్శ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొని సీనియర్ సిటిజన్స్‌ను సన్మానిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్, ఫిబ్రవరి 6: కాలనీల అభివృద్ధిలో సీనియర్ సిటిజన్స్ భాగస్వాములు చేసుకోవాలని మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. ప్రగతినగర్ కాలనీలోని సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం భవనంలో మంగళవారం ఆదర్శ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ దశాబ్ది ఉత్సవాలకు కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీనియర్ సిటిజన్స్ సమాజానికి దిక్సూచి లాంటి వారని తెలిపారు. సీనియర్ సిటిజన్స్ తమ సొంత నిధులతో భవనాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో సోమిరెడ్డి, రాంరెడ్డి, వీరారెడ్డి, సత్యనారాయణ, రాంచంద్రారెడ్డి, బ్రహ్మరెడ్డి పాల్గొన్నారు.

## విద్యార్థినులకు డేటా ప్రోగ్రామ్ శిక్షణ సర్టిఫికెట్లు




కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోత్స్నప్రభ

హయత్‌నగర్, ఫిబ్రవరి 6: హయత్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లీడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు డేట్రా ప్రోగ్రామ్ నిర్వహించగా, పూర్తిచేసిన వారికి శిక్షణా సర్టిఫికెట్లు ప్రదానం చేసినట్లు మంగళవారం తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోత్స్నప్రభ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్-2 మహిళా విభాగం ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ జాహీదా బేగం పర్యవేక్షణలో నిర్వహించిన విద్యార్థినులు శిక్షణ పూర్తిచేయడం సంతోషకరమన్నారు. విద్యార్థినులు తమ ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకోవడానికి దోహదపడుతుందని ఆకాంక్షించారు. కార్యక్రమంలో లీడ్ ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సంజీవ్, అధ్యాపకులు, విద్యార్థినులు సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, ఫిబ్రవరి 6: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ సబ్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలివేస్తున్నట్లు ఆస్మాన్‌ఘడ్ డీఈఈ హనుమంత్ రెడ్డి తెలిపారు. 11 కేవీ వెంకటాద్రినగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 10:30 గంటల వరకు, 11 కేవీ సమత డిగ్రీ కాలేజీ ఫీడర్ పరిధిలో ఉ. 10:30 గంటల నుంచి మ. 1:30 గంటల వరకు, 11 కేవీ గౌతంనగర్ ఫీడర్ పరిధిలో మ. 2 గంటల నుంచి మ. 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## ట్రాఫిక్ పోలీసులు విధిగా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

సౌత్ ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ




వైద్య పరీక్షలు చేయించుకుంటున్న సౌత్ ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ

మలక్‌పేట, ఫిబ్రవరి 6: ట్రాఫిక్ పోలీసులు విధి నిర్వాహణతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సౌత్ ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ ట్రాఫిక్ సిబ్బందికి సూచించారు. యశోద దవాఖాన వైద్యుల సౌజన్యంలో రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో ప్రత్యేక కార్యక్రమాన్ని స్వాతి పంక్షన్ హాల్లో నిర్వహించారు. ట్రాఫిక్ పోలీసులు, వారి కుటుంబ సభ్యులకు వైద్య, ఆరోగ్య పరీక్షల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సత్యనారాయణ ప్రారంభించి, వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎండ, వాన, చలి అనకుండా నిత్యం రోడ్లపై విధులు నిర్వహించే ట్రాఫిక్ పోలీసులు దుమ్ము, ధూళి, కాలుష్యం బారిన పడతారని, దాంతో అనారోగ్య సమస్యలు తలెత్తె అవకాశం ఉంటుందన్నారు. విధి నిర్వాహణతో పాటు ఆరోగ్య పరిరక్షణకు కూడా తగిన ప్రాధాన్యాన్ని ఇవ్వాలని ఆయన వారికి సూచించారు. ఆరోగ్యంగా ఉంటేనే విధులు సక్రమంగా నిర్వహించగలరని ఆయన పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఆరోగ్యం పట్ల కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నెలరోజులుగా ప్రజలకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బందిని ఈ సందర్భంగా ఏసీపీ సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ట్రాఫిక్ ఎస్ఐలు రాము, యాదయ్య, రామస్వామి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## భర్త హత్యోదంతం.. భార్య, ప్రియుడికి జీవిత ఖైదు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, ఫిబ్రవరి 6(నమస్తే తెలంగాణ): కట్టుకున్న భర్తను తన ప్రియుడితో కలిసి హత్య చేసిన భార్య షాహినా బేగం(26), ప్రియుడు మహ్మద్ యూసుఫ్‌ఖాన్(34)కు జీవిత ఖైదుతో పాటు రూ. 400ల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీమతి భవానీ చంద్ర తీర్పునిచ్చారు. అదనపు పీపీ కస్తూరి బాయి కథనం ప్రకారం, బాలాపూర్ మండలం ఓమర్ కాలనీకి చెందిన మహ్మద్ సలీం తన భార్య షాహినా బేగం, పిల్లలతో కలిసి ఉన్నాడు. మైలార్‌దేవపల్లికి చెందిన మహ్మద్ యూసుఫ్‌ఖాన్‌తో షాహినా బేగంకు అక్రమ సంబంధం ఏర్పడింది. దీంతో షాహినా బేగం ప్రవర్తనను అనుమానించిన భర్త సలీం నిలదీయడంతో తన భర్తను హత్య చేయాలని ప్రియుడితో కలిసి పథకం పన్నింది. 2017, ఆగస్టు 15 అర్ధరాత్రి షాహినా బేగం, యూసుఫ్‌ఖాన్ కలిసి నిద్రమత్తులో ఉన్న సలీమ్‌ను గొంతు నులిమి హత్య చేశారు. అనంతరం, తన భర్త మద్యం మత్తులో చనిపోయాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పహడీషరీఫ్ పోలీసులు దర్యాప్తు చేపట్టి, ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్ తరలించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితులిద్దరికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పునిచ్చింది.

## కార్మికుల హక్కులను కాల రాస్తున్న కేంద్రం

సీఐటీయూ కందుకూరు కార్యదర్శి బుట్టి బాలరాజు



డాక్టర్ రాధికకు వినతిపత్రం ఇస్తున్న బాలరాజు, ఆశా వర్కర్లు

కందుకూరు, ఫిబ్రవరి 6: కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందని సీఐటీయు మండల కార్యదర్శి బుట్టి బాలరాజు తెలిపారు. ఆశా వర్కర్లు, మంగళవారం సీఐటీయూ నాయకులతో కలిసి ఈ నెల 16న నిర్వహించే గ్రామీణ బంద్ కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు డాక్టరు రాధికకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ, ఆశా వర్కర్లను పర్మినెంట్ చేయకుండా చాలీచాలని వేతనాలను ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 25 ఏండ్లుగా ఆశా వర్కర్లు పని చేస్తున్నట్లు వివరించారు. వెంటనే వారిని రెగ్యులర్ చేసి రూ.18 వేలను నెలకు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు జయసుధ, శ్రీలత, అనిత, చంద్రకళ, ముంతాజ్ బేగం, సునీత, అశ్విని, జయమ్మ, సురేఖలు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్‌లకు నేడు ఆత్మీయ వీడ్కోలు

కందుకూరు, ఫిబ్రవరి 6: నేడు (ఈ నెల 7వ తేదీన) కందుకూరు మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశపు హాలులో ఉదయం 10 గంటలకు మాజీ సర్పంచ్‌లకు పదవీ విరమణ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్టు మండల పరిషత్ అభివృద్ధి అధికారి వెంకట్ రాములు తెలిపారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినందున ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితా హరినాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిలు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఎంపీపీ మంద జ్యోతి పాండుతో పాటు జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, వైఎస్ ఎంపీపీ గంగుల శమంతలు హాజరయ్యే సమావేశానికి ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## అక్రమ నిర్మాణాల కూల్చివేత

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 6: పోచారం మున్సిపాలిటీ, ఘట్‌కేసర్ మండల పరిధిలోని గ్రామాల్లోని ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మించిన కట్టడాలను రె వెన్యూ, పోలీసు అధికారులు మంగళవారం తెల్లవారుజామున కూల్చివేశా రు. కీసర ఇన్‌చార్జి తహసీల్దార్ ఆధ్వర్యంలో ఘట్‌కేసర్ డిప్యూటీ తహసీల్దార్ సందీప్‌రెడ్డి, ఆర్ఐ శ్రీరాం సిబ్బంది, పోలీసులతో కలిసి కూల్చివేతలను చేపట్టారు. అన్నోజిగూడ సర్వే నం.3 బై 1లోని స్థలంలో 21, ఘట్‌కేసర్, ఘనాపూర్ పరిధిలో సర్వే నం.1107 స్థలంలోని 9 అక్రమ కట్టడాలను తొలగించినట్లు అధికారులు ప్రకటించారు.

# యూజీడీ పనులు నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలి

ఎల్బీనగర్, ఫిబ్రవరి 6: యూజీడీ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ పవన్ కుమార్ అన్నారు. కొత్తపేట డివిజన్‌లోని ఆర్టీసీ కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులను కార్పొరేటర్ పవన్ కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పవన్ మాట్లాడుతూ డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేసి కాలనీవాసులకు సమస్యలు లేకుండా చూడాలన్నారు. రోడ్ నం: 3లో మంచినీటి లైన్‌ను మరో 100 మీటర్లు పొడిగించాలని అధికారులకు సూచించారు. అనంతరం కాలనీ కమ్యూనిటీ హాల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్టీసీ కాలనీ అధ్యక్షుడు పెంటారెడ్డి, యాదగిరి, లక్ష్మయ్య గౌడ్, శివాచారి, కృష్ణారెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్, తదితరులు

## నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు

మేయర్ చిగిరింత పారిజాతారెడ్డి

బడంగ్‌పేట, ఫిబ్రవరి 6: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాత గ్రామంలో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ పనులను మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి మంగళవారం పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలను పాటించకుండా పనులు చేపట్టరాదన్నారు. నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కాంట్రాక్టర్, అధికారులను హెచ్చరించారు. అభివృద్ధి పనులు జరుగుతున్న క్రమంలో అధికారులు తూ.చ. తప్పకుండా చూడవలసిన బాధ్యత వారిపై ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సుందర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కమ్యూనిటీ హాల్ పనులను పరిశీలిస్తున్న మేయర్

## రింగురోడ్డుపై ఘోర ప్రమాదం

- పల్టీలు కొట్టి.. ఇన్నోవాపై పడిన కారు
- ఇద్దరి మృతి




పూర్తిగా దెబ్బతిన్న కారు ముందు భాగం

మేడ్చల్, ఫిబ్రవరి 6 : ఔటర్ రింగు రోడ్డుపై ఘోర ప్రమాదం జరిగింది. మితిమీరిన వేగంతో వెళ్తున్న కారు అదుపుతప్పి గాలిలో పల్టీలు కొట్టింది. డివైడర్ దాటి అటువైపు నుంచి వెళ్తున్న ఇన్నోవా కారుపై పడింది. ఈ ఘటనలో ఎక్స్‌యూవీ కారులో ప్రయాణిస్తున్న విద్యార్థుల్లో ఒకరు, ఇన్నోవా కారులో ఉన్న మరొకరు మృతి చెందారు. ఈ ఘటన సోమవారం రాత్రి జరిగింది. ఎస్సై నవీన్ రెడ్డి కథనం ప్రకారం.. కూకట్‌పల్లి నివాసి రెడ్డి గణేశ్(18), మంగళపు గణేశ్, మోక్షిత్ రెడ్డి దుండిగల్‌లో ఉన్న ఎంఎల్‌ఆర్ఐటీలో ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నారు. సోమవారం ఇంట్లో నుంచి కారులో బయల్దేరారు. మధ్యాహ్నం కళాశాలకు వెళ్లి, మిడ్-2 పరీక్షలకు హాజరయ్యారు. పరీక్ష ముగిసిన అనంతరం జాలీగా రింగురోడ్డు ఎక్కారు. రాత్రి వరకు తిరిగి, 10 గంటల సమయంలో కూకట్‌పల్లికి తిరుగు పయనమయ్యారు. శామీర్‌పేట నుంచి కీసర వైపు విద్యార్థులు వేగంగా వాహనాన్ని నడుపుతూ వస్తున్నారు. వారు ఎగ్జిట్ 6 (మేడ్చల్) సమీపానికి చేరుకోగానే వాహనం అదుపుతప్పి.. గాలిలో పల్టీలు కొట్టింది. అదే సమయం వనస్థలిపురానికి చెందిన రెడ్డప్ప(50) బాచుపల్లిలో తన పని ముగించుకొని, తిరిగి రింగు రోడ్డు మీదుగా ఇన్నోవా కారులో వెళ్తున్నాడు. పల్టీలు కొడుతూ వచ్చిన విద్యార్థులు కారు రెడ్డప్ప ప్రయాణిస్తున్న కారుపై పడింది. ఆయన కారులో ఇరుక్కుపోయాడు. ఈ ఘటనలో రెడ్డప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లారు. తీవ్రంగా గాయపడిన విద్యార్థులను కొంపల్లిలో ఉన్న శ్రీకర హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న విద్యార్థుల్లో రెడ్డి గణేశ్ రాత్రి 12 గంటల తర్వాత మృతి చెందాడు. మిగితా వారి పరిస్థితి కూడా విషమంగానే ఉన్నట్టు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## అక్రమ కేసులను వ్యతిరేకిస్తూ నిరసన

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 6 : తనపై అధికార పార్టీ నాయకులు అక్రమంగా కేసులు పెట్టిస్తున్నారని నిరసిస్తూ, స్థానిక బీజేపీ నాయకుడు ఘట్‌కేసర్‌లో మంగళవారం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ బొక్కొనిగూడకు చెందిన మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ అధికార పార్టీ, స్థానిక కౌన్సిలర్ భర్త పోలీసులతో కుమ్మకై తనపై అక్రమంగా కేసులు పెట్టిస్తున్నారని ఆరోపించాడు. అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్ భర్త చేస్తున్న అక్రమాలకు అడ్డు తగులడంతోనే తన పై పోలీసులు తప్పుడు కేసులు పట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని బాధితుడు మహిపాల్ రెడ్డి పోలీసులకు తెలిపాడు. ఆయనకు బీజేపీ నాయకులు నర్సింహారెడ్డి,కొమ్మిడి దామోదర్‌రెడ్డి, ఎంపీటీసీ కొమ్మిడి శోభారాణి, ఘట్‌కేసర్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు హన్‌మాన్ మద్దతుగా నిలిచారు. స్టేషన్‌కు తరలించి అరెస్టు చేసినట్లు సీఐ గోవర్ధనగిరి తెలిపారు.

## అమీర్‌పేటలో పల్లెకు పోదాం పదండి



అమీర్‌పేట గ్రామంలో పర్యటిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

బడంగ్‌పేట, ఫిబ్రవరి 6: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రతి పల్లెకు పోయి ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. మహేశ్వరం మండలంలోని అమీర్‌పేట గ్రామంలో పల్లెకు పోదాం పదండి అనే కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ పథకంపై ప్రతి గ్రామంలో 24 గంటలు ఉండి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామంలో ఉన్న సమస్యలను తెలుసుకోవాలన్నారు. ప్రజలతో కలిసి వారి సాధక బాధకాలు తెలుసుకొని పరిష్కరించడానికి కృషి చేయవలసిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బొక్క నర్సింహారెడ్డి, అందెల శ్రీరాములు యాదవ్, దేవేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, పాపయ్య, అనంతయ్య గౌడ్, జంగయ్య యాదవ్, మాధవాచారి, సుదర్శన్ రెడ్డి, యాదయ్య, అనిత, శంకర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

## 10న గడ్డి అన్నారం ఆర్యవైశ్య సర్వసభ్య సమావేశం

ఆర్కేపురం, ఫిబ్రవరి 6: గడ్డి అన్నారం ఆర్యవైశ్య సంఘం సర్వసభ్య సమావేశం ఈ నెల 10వ తేదీ శనివారం ఉదయం 9గంటలకు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు చింతల బాలరాజు గుప్తా తెలిపారు. కర్మన్‌ఘాట్‌లోని శ్రీ లక్ష్మి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించే ఈ సమావేశానికి ఆర్యవైశ్య సంఘం సభ్యులందరూ సమయానికి వచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రెండేళ్లలో కార్యవర్గం చేసినటువంటి కార్యక్రమ వివరాలు తెలియజేయనున్నట్లు ఆయన తెలిపారు. సంఘం అభివృద్ధికి సహకరించిన దాతలకు, పూర్వ అధ్యక్షులకు, సంఘ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేస్తామని చెప్పారు. సంఘం యొక్క ఆర్థిక లావాదేవీల వివరాలు తెలియజేయడంతో పాటు ఇతర విషయాలపై చర్చ ఉంటుందని చెప్పారు.

## పేద కుటుంబానికి ఆర్థిక సహాయం



ఘట్‌కేసర్‌లోని ఓ పేద కుటుంబానికి సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్టు ఆర్థిక సహాయం అందజేసింది. భర్త అకాల మరణం కారణంగా ఇద్దరు ఆడపిల్లలతో అనాథగా మారి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళకు ట్రస్టు సభ్యులు రూ.10వేల చెక్కును అందజేశారు. ఘట్‌కేసర్‌లోని బ్రూక్‌బాండ్ కాలనీకి చెందిన కిశోర్‌లాల్ ఇటీవల అకస్మాత్తుగా మరణించాడు. విషయం తెలుసుకున్న ట్రస్టు సభ్యులు సుందర్‌రావు, శ్రీకాంత్, దేవానంద్, సోమయ్య, అనిల్‌సింగ్, వీరారెడ్డి, బంగారుబాబు ఈ చెక్కును అందజేశారు.

- ఘట్‌కేసర్, ఫిబ్రవరి 6